అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సీఎం రాకకు ఏర్పాట్లు చేయాలి

సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 20 వేములవాడకు రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల పనితీరు, క్షేత్ర స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై కలెక్టర్ ఇతర అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జిల్లా పర్యటనకు ఏర్పాట్లు చేయాలని, రాజన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని, సంక్షేమ పథకాలలో ఏలాంటి కోత ఉండదన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం సేకరించాలని, ధాన్యం ఆన్‌లైన్‌లో నమోదు చేసి రెండు రోజుల్లో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, మధ్యమానేరు నిర్వాసితుల కోసం 10,600 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించాలని మంత్రిని విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సమావేశంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహజన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి కేంద్రమంత్రి పదవికి అర్హుడా?

తమది చేతగాని ప్రభుత్వం కాదని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని, అందులో తాము జోక్యం చేసుకోబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. దాడులు చేస్తే అరెస్టు చేస్తారా..? అంటూ కలెక్టర్‌పై దాడి చేసిన వారిని సమర్థించేలా మాట్లాడుతున్న కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి పదవికి అర్హుడా? అని ప్రశ్నించారు. శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ సిరిసిల్ల శాఖ చైర్మన్ నాగుల సత్యనారాయణ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ నెల 20న వేములవాడకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నేతన్నలకు, రైతులకు భరోసానిచ్చే పథకాలు వెల్లడిస్తారని చెప్పారు. నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగుల సత్యనారాయణను అభినందించారు. సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి కట్కం మృత్యుంజయం, వెలిచాల రాజేందర్, సిరిసిల్ల పట్టణ శాఖ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప పాల్గొన్నారు.

రాజన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు..

వేములవాడ టౌన్, నవంబర్ 15: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మంత్రి పోలీసు వందనం స్వీకరించారు. ఈ నెల 20న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటనలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణతో కలిసి రాజన్న ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం సందర్శించే చైర్మన్ గెస్ట్‌హౌస్, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ అధికారులు , కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ రఘు మృతి

నివాళులర్పించిన మాజీ మంత్రి రాజేశంగౌడ్

వేములవాడ రూరల్, నవంబర్ 15 : వేములవాడ మాజీ ఎంపీపీ మేర్గు రఘు అనారోగ్యంతో మృతి చెందగా, మాజీ మంత్రి రాజేశంగౌడ్ భౌతికగాయానికి నివాళులర్పించారు. వేములవాడ ఎంపీపీగా రఘు చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే మాజీ జడ్పీటీసీ అరుణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి రఘు కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.

గ్రూప్ -4లో యువకుల ఎంపిక

ముస్తాబాద్, నవంబర్ 15 : టీజీపీఎస్సీ గురువారం విడదల చేసిన గ్రూప్ -4 పరీక్షా ఫలితాలో మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు సత్తాచాటారు. పోతుగల్‌కు చెందిన పేద కుటుంబాలకు చెందిన జంగా వెంకటేశ్, బొల్లె హరి ప్రసాద్ ఉద్యోగం సాధించడంపై పోతుగల్ వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ యువత హర్షం వ్యక్తం చేసి, ఎంపికైన యువకులను అభినందించారు. జంగ వెంకటేశ్ కమిషనర్ మున్సిపల్ వార్డు ఆఫీసర్ (సీఎండీ)గా ఉద్యోగం పొందారు. బొల్లె హరిప్రసాద్ సీసీఎల్ఏ (రెవెన్యూ డిపార్ట్‌మెంట్)లో ఉద్యోగంకు ఎంపికపై సంతోషం వ్యక్తం చేశారు.

గంభీరావుపేట మండల వాసుల సత్తా

గంభీరావుపేట, నవంబర్ 15 : మండలంలోని ఆయా గ్రామాల యవత గ్రూప్-4లో సత్తా చాటారు. ప్రభుత్వం విడుదల చేసిన పలితాలలో మండలం నుంచి ముగ్గురు ఉద్యోగాలు సాదించారు. మల్లారెడ్డిపేటకు చెందిన బంటు సౌజన్య జూనియర్ అసిస్టెంట్, శ్రీగాధకు చెందిన వేముల భరత్ గౌడ్, మండల కేంద్రానికి చెందిన యాడారపు మధులు వార్డు అధికారులుగా సత్తా చాటారు. వారిని తోటి స్నేహితులు, కుటుంభ సభ్యులు అభినందించారు.

జిల్లాలో 4వ ర్యాంకు సాధించిన పెద్దలింగాపూర్ వాసి

ఇల్లంతకుంట, నవంబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కరివెద నిఖిల్ రెడ్డి జిల్లాలో 4వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ రాష్ట్రంలో 142వ ర్యాంకు సాధించి కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించానని నిఖిల్ తెలిపారు. తల్లితండ్రులు, గురువుల సహకారంతో ఈ ర్యాంకు సాధించానన్నారు. జిల్లా స్థాయి ర్యాంకు సాధించిన నిఖిల్ రెడ్డిని గ్రామస్తులు అభినందించారు.

పట్టుబట్టి కొలువు కొట్టి

వీర్నపల్లి, నవంబర్ 15 : తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాల్లో మండల యువకులు ప్రతిభ చూపారు. బాబాయి చెరువుతండాకు చెందిన అజ్మీరా పంగవ్వ, తార్యాల చిన్న కుమారుడు లింగం రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. అదే తండాకు చెందిన బానోత్ జయ, కిషన్ కుమారుడు సురేశ్ వార్డు అఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. శాంతినగర్‌కు చెందిన బానోత్ పద్మ, సేవ్యానాయక్ కుమారుడు శ్రీకాంత్ ఆదాయపు పన్ను శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. కష్టపడి సర్కారు కొలువులు సాధించిన యువకులను తండావాసులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED HELPERS
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958-All

CHANGE OF NAME
I, SANGITA SURESH FATING, W/o. SURESH FATING, R/o.D-55, NTPC, PTS, Jyothinagar, Ramagundam, have changed my name from GEETA GOVINDRAO SARODE to SANGITA SURESH FATING for all further purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వేములవాడ టౌన్ : ఆలయ ప్రాంగణంలో భక్తులు

జ్వాలాతోరణం కింద నుంచి వెళ్తున్న పల్లకీసేవ

జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం కనుల పండువలా సాగాయి. భక్తులు వేలాదిగా తరలిరాగా, ఆలయాలన్నీ కిటకిటలాడాయి. మహిళలు ఉదయమే తలస్నానాలు చేసి.. ఉసిరి కొమ్మలను తులసీ కోటలో ప్రతిష్ఠించి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

కనుల పండువలా కార్తీక పౌర్ణమి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- వైభవంగా తులసీ పూజలు, సత్యనారాయణ వ్రతాలు
- పోటెత్తిన భక్తజనం

వేములవాడ టౌన్, నవంబర్ 15 : రాజన్న ఆలయం శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు వేలాది మంది భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దుచేశారు. సత్యనారాయణవ్రతాలు, పల్లకీసేవలు, పెద్దసేవలు నిర్వహించారు. జ్వాలాతోరణం కన్నుల పండువలా జరిపించారు. ఓపెన్‌స్లాబ్‌పై సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. రాజన్నను సుమారు 40 వేలకుపైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రాజన్నకు సుమారు రూ. 23 లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. భక్తులకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు నర్సయ్య, తిరుపతిరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్, రాజేందర్ ఏర్పాట్లు చేశారు.

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 15 : మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పండితులు బీటుకూరి గోపాలాచారి, నవీన్‌చారి ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్, వైస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

ఇల్లంతకుంట, నవంబర్ 15 : మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రంలో ఆలయ పూజారి నాగరాజు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చన చేశారు.

వేములవాడ రూరల్, నవంబర్ 15 : మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో తులసీ కల్యాణం నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బోయినపల్లి, నవంబర్ 15 : వరదవెళ్లి దత్తాత్రేయస్వామి ఆలయంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దత్తాత్రేయ స్వామి ఆలయం చుట్టూ రాజరాజేశ్వర జలాశయం నీళ్లు ఉండడంతో భక్తులు, ఆలయ పూజారి, ఆలయ కమిటీ సభ్యులు బోటులో గుట్టపైకి వెళ్లి పూజలు చేశారు.

సిరిసిల్ల టౌన్, నవంబర్ 15 : సిరిసిల్లలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తులసీమాత-సాలగ్రామానికి తులసీ కల్యాణం కనుల పండులా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాజన్న ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇల్లంతకుంట : గంగాధర క్షేత్రంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట : స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

బీఆర్ఎస్ నేతలనే బలి చేయడం సరికాదు

బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు కుర్ర సావిత్రి

మాట్లాడుతున్న సావిత్రి

ముస్తాబాద్, నవంబర్ 15 : లగచర్ల సంఘటనలో బీఆర్ఎస్ కుట్ర ఉందని నేతలను బలి చేయడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు కుర్ర సావిత్రి అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా విలేజీ పేరుతో వ్యవసాయ పంట పొలాలు లేకుంటే వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు బతుకులు ఆగమైతాయని భూములివ్వమని ఖరాకండిగా చెప్పుతున్నా భూ సేకరణకు వచ్చిన అధికారులపై తిరుగబడ్డ గిరిజనులతో పాటు అక్కడి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకుండా అరెస్టు చేయడం ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. వ్యవసాయ భూములపై ఆధాపడి కుటుంబాలను పోషించుకుంటున్న రైతు కుటుంబాలను ఆగం చేయొద్దని బతిమిలాడినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపక సేకరణకు వచ్చిన అధికారులపై ఎదురుతిరుగుతే కేసులు పెట్టాలకాని అర్ధరాత్రి వేళ వచ్చి ఈడ్చుకెళ్లడం అప్రజాస్వామ్య చర్యగా అభివర్ణించారు. ప్రజా నాయకుడిగా తన పాంత్ర ప్రజలు ఫోన్ చేస్తే మాట్లాడడం తప్ప, బాధ్యత గల ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకుడు అధికారుల మీద దాడి చేయమని ప్రోత్సాహించరాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఇచ్చిన హామీలు 11 నెలల ప్రజాపాలనపై ప్రజలకు కమ్మకం పోయిందని బీఆర్ఎస్ న్యాయకుడి పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గుర్తు చేసుకుంటున్నారని, బీఆర్ఎస్‌పై పురుగుతున్న ఆదరణను చూసి పార్టీని బదనాం చేయుటకు పన్నిన కుట్రగా లగచర్ల సంగటన తెలిపారు. అరెస్టు చేసిన వారిని విడదల చేసి, నాయ్యపరమైన తీసుకోవాలన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబర్ 15 : మండలంలో చందుర్తి-రామన్నపేట అటవీ ప్రాంతంలో వెలిసిన వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం కనుల పండువలా జరిగింది. ఏటా కార్తీక పౌర్ణమి రోజు స్వామివారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి కల్యాణం తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి స్వామివారికి విగ్రహాలను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, బీజేపీ నాయకుడు రమేశ్, మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, మాజీ జడ్పీటీసీ కుమార్, నగేశ్ పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర

రుద్రంగి, నవంబర్ 15 : మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారి తిరునాళ్లు(జాతర), నాగవెళ్లి మహోత్సవం శుక్రవారం కనుల పండువలా జరిగింది. ఉదయం నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ పరిసర ప్రాంతాలు భక్త జనంతో కోళాహలంగా మారింది. ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవమూర్తుల విగ్రహాలను మేళతాళాల మధ్య పల్లకీలో గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగించగా మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానం ప్రారంభించారు. సాయంత్రం స్వామి వారి నాగవెళ్లి అత్యంత వైభవంగా నిర్వహించగా పెద్దఎత్తున భక్తులు, ప్రజాప్రతినిధులు హాజరై తిలకించారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ అశోక్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకుటుంన్న నాయకులు, భక్తులు

పిచ్చికుక్క వీరంగం

- ఎల్లారెడ్డిపేట మండలంలో 20 మందిపై దాడి
- ఉదయం నుంచి రాత్రి దాకా స్వైరవిహారం

గాలతో చిన్నారి

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 15: ఎల్లారెడ్డిపేట మండలం పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా స్వైర విహారం చేసిం ది. దాదాపు 20 మందిని దాడిచేసింది. అందులో పిల్లలను తీవ్రంగా గాయపరిచింది. మొదట నారాయణపూర్‌లో ముగ్గురు, సాయంత్రం రాగట్లపల్లిలో ముగ్గురిని, రాత్రి ఎల్లారెడ్డిపేటలో వేణుగోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న 14 మందిపై దాడి చేసింది. దీంతో భక్తులంతా భయాందోళనకు గురికాగా, బాధితులు చికిత్స కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు క్యూ కట్టారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా హాస్పిటల్‌కు వెళ్లారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- గిరిజన హక్కుల పోరాట యోధుడు బీర్సా ముండా 150వ జయంతి

మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, నవంబర్ 15 : ప్రభుత్వ పథకాలు గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా 150 జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళుర్పించారు. ధర్తి ఆబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ గిరిజన సంక్షేమం, సంకల్పం నుంచి సత్వర ఆచరణ దిశగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన హక్కుల కోసం పోరాడిన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా అని కొనియాడారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన..

ఖేలో ఇండియా జాతీయస్థాయి సైక్లింగ్ పోటీల్లో గిరిజన విద్యార్థిని మలావత్ సౌందర్య బంగారు పతకం సాధించడంతో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అధికారులు అభినందించి, రానున్న రోజుల్లో కూడా అన్ని పోటీల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఇక్కడ డీటీడబ్ల్యూవో జనార్ధన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

సిరిసిల్ల టౌన్, నవంబర్ 15 : సిరిసిల్లలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం అయ్యప్ప ఆలయ ట్రస్ట్ చైర్మన్ రాచ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్వజారోహణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాచ విద్యాసాగర్ మాట్లాడుతూ అయ్యప్ప ఆలయంలో స్వాములకు జనవరి 13 వరకు మహా అన్నదానం ఉంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సురేశ్, దుబ్బ విశ్వనాథం, లింగారెడ్డి, రాజు, శంకర్, దేవయ్య పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకుంటలేదు

వీర్నపల్లి, నవంబర్ 15 : ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా కార్మికులను పట్టించుకున్న పాపాన పోలేదని సీపీఎం నాయకులు ఎగుమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండలంలోని లాల్‌సింగ్‌తండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కూలీలను తీసుకొచ్చి స్థానిక కూలీల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. నేతలు రాజయ్య, గజన్, చందు,ప్రకాశ్ ఉన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో నర్మాల గురుకుల విద్యార్థుల సత్తా

గంభీరావుపేట, నవంబర్ 15: మండలంలోని నర్మాల గురుకుల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిలు మూడు జిల్లాల స్థాయి స్పోర్ట్ మీట్‌లో పాల్గొని సత్తా చాటారని ప్రిన్సిపాల్ సృజన తెలిపారు. మెదక్ జిల్లాలో మూడు జిల్లాల స్థాయి 10వ జోనల్ 2024-25 క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయా క్రీడా పోటీలలో నర్మాల గురుకుల పాఠశాల విద్యార్థినిలు పాల్గొని ఓవరాల్ చాంపియన్ షిప్‌లో సత్తా చాటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చందుర్తి, నవంబర్ 15 : గ్రామాల్లో పురుగుల మందులు విక్రయించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫర్టిలైజర్ యజమాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఇటీవల పురుల మందు తాగి ఆత్మహత్యలు పెరుగుతున్న దృశ్య ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఫర్టిలైజర్ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పురుగుల మందులను కేవలం రైతులకు మాత్రమే విక్రయించాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాలు ఫర్టిలైజర్ యజమానులు పాల్గొన్నారు.

24న బహిరంగ సభ

సిరిసిల్ల టౌన్, నవంబర్ 15 : జిల్లా కేంద్రంలో ఈ నెల 24న మాల, మాల ఉపకులాల బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు రాగుల రాములు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభకు ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ డీఎస్పీ దామెర నర్సయ్య హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని మాల, మాల ఉపకులాల వారందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జై తెలంగాణ జిల్లా అధ్యక్షుడు దోశల చంద్రం, జిల్లా కన్వీనర్ వంకాయల భూమయ్య, గొట్టె లింబాద్రి, బూర సురేశ్, బూర బాలమల్లు ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రుద్రంగి, నవంబర్ 15 : సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీలత అన్నారు. సామాజికి, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను తహసీల్దార్ శ్రీలత పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, ఏఎస్‌వో గణేశ్, రెవెన్యూ సిబ్బంది, ఎన్యూమరేటర్ ఉన్నారు.

ప్రతిపైసా భక్తుడికే ఖర్చు పెట్టాలి

వేములవాడ, నవంబర్ 15: శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి హుండీ ద్వారా, ఇతర ఆర్జిత సేవల ద్వారా సమకూరుతున్న ప్రతి పైసాను భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి మాత్రమే వినియోగించాలని బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించే విషయమై రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రసాదం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చి, నిధులు తీసుకురావడానికి ప్రయత్నాలు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా పోరాటాలకు సీపీఎం సిద్ధం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు